ప్రజారోగ్యానికి జిమ్‌దాబాద్



షిప్‌యార్డు లే అవుట్‌లో ఆకర్షణీయంగా ఓపెన్ జిమ్





ఓపెన్ జిమ్‌లో వ్యాయామం చేస్తున్న కాలనీవాసి

కోవిడ్ తర్వాత ప్రజానీకం జీవనశైలిలో మార్పు అనివార్యమైంది. ప్రతీ ఒక్కరూ ఆరోగ్య పరిరక్షణకు శ్రద్ధ చూపుతున్నారు. రోజువారీ దినచర్యలో భాగంగా ఉదయం, లేదా సాయంత్రం వేళల్లో కొద్దిసేపైనా వ్యాయామానికి సమయం కేటాయిస్తున్నారు. పిల్లల నుంచి వృద్ధుల వరకు ఇందుకోసమని తమ నివాసాలకు సమీపంలోని పార్కులకు వస్తున్నారు. అయితే గత ప్రభుత్వ హయాంలో ఏ పార్కు ఎక్కడుందో కూడా తెలిసేది కాదు. కొన్నిచోట్ల ఆక్రమణకు గురవగా... మరికొన్ని ఆకతాయిలకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోయేవి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన తర్వాత పార్కుల పరిరక్షణతోపాటు అభివృద్ధికి పెద్ద పీట వేసింది. నగర వాసుల ఉపయోగార్థం ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుకు ప్రాధాన్యమివ్వాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ క్రమంలో కాలనీలకు సమీపంలోనే ఓపెన్ జిమ్‌లు అందుబాటులో ఉండటంతో ఒక్క రూపాయి ఖర్చు లేకుండానే స్థానికులు కసరత్తులు చేస్తున్నారు.

– మధురవాడ

పార్కుల్లో ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు

వ్యాయామం చేసేందుకు ప్రజానీకం క్యూ



మధురవాడలో ఓపెన్ జిమ్‌లో వ్యాయామం



చిట్టివలస బంతాట మైదానంలో ఓపెన్ జిమ్

రూ.60 లక్షలతో 12 పార్కులు



భీమిలి నియోజకవర్గం పరిధి జీవీఎంసీ మధురవాడ జోన్ – 2లోని 5, 6, 7, 8 వార్డుల్లో 12 ప్రాంతాల్లో రూ.60 లక్షలతో ఇటీవల ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. మధురవాడ ఆర్‌టీసీ డిపో వద్ద మగద పార్కు, వాంబే కాలనీ, స్వతంత్రనగర్, ఆర్‌టీసీ కాలనీ, గణేష్‌నగర్ వద్ద గల ఏఎస్‌ఆర్ నగర్, భగవాన్ దాస్ కాలనీ, పీఎం పాలెం 2వ బస్టాప్ వద్ద నీమ్ ట్రీస్ పార్కు, ఆర్‌హెచ్ కాలనీ, బింద్రానగర్, అవంతి కళ్యాణ మండపం సమీపంలోని సన్ రైజ్ వెల్ఫేర్ అసోసియేషన్ పార్కు, పీఎం పాలెం సృజన స్కూలు వద్ద షుగర్ ఫ్యాక్టరీ లే అవుట్ పార్కులో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. ఇవి కాకుండా మరో రూ.25 లక్షల వ్యయంతో 5 చోట్ల ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కేవలం మధురవాడ జోన్‌లోనే వందకి పైగా పార్కులకు ఫెన్సింగ్ వేసి పరిరక్షణ చర్యలు చేపట్టారంటే అతిశయోక్తి కాదు. ఇవికాక నిత్యం ప్రజలు ఉపయోగిస్తున్న పార్కులను అనేక రకాలుగా అభివృద్ధి చేస్తున్నారు.

యువత కలలు సాకారం

తగరపువలస: దశాబ్దాలుగా చిట్టివలస కార్మికవాడలోని యువతకు ప్రభుత్వాలు వ్యాయామశాలలు ఏర్పాటు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడేవారు. వెటరన్, ఇతర క్రీడాకారులు భీమిలి వుడా మినీస్టేడియం, మామిడిపాలెంలోని ఇండోర్ స్టేడియంలో సాధన చేస్తుండేవారు. గతంలో వ్యాయామశాలల ఏర్పాటుకు ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగినా ప్రయోజనం ఉండేది కాదు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయడంతో యువకులంతా ఉత్సాహంగా సాధన చేస్తున్నారు. రూ.4.40 లక్షలతో చిట్టివలస బంతాట మైదానంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. భీమిలి, సంతపేట చిల్డ్రన్స్ పార్కులో కూడా ఇలాంటి జిమ్‌ల ఏర్పాటుకు చర్యలు ప్రారంభించారు.

చాలా ఉపయోగకరంగా ఉంది



నగరంలో అన్ని రకాల సేవలు ఖరీదైపోతున్నాయి. ఇక జిమ్‌ల ఫీజులు వేరే చెప్పనక్కర్లేదు. ఆ ఖర్చు భరించలేక ఇబ్బందులు పడే పరిస్థితి లేకుండా సామాన్యుల కోసం ప్రభుత్వమే ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసి అందుబాటులోకి తీసుకొచ్చింది. చాలా ఆనందంగా ఉంది. గణేష్‌నగర్ వద్ద అల్లూరి సీతారామరాజు నగర్‌లోని పార్కులో ఉన్న జిమ్‌ను ఉపయోగించుకుంటున్నాం. చాలా మంచి పరకరాలు అందుబాటులోకి తెచ్చారు.

– కె.కల్యాణ్ చక్రవర్తి, మధురవాడ

పేదింటి క్రీడాకారులకు మేలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి క్రీడలకు అత్యంత ప్రాధాన్యత కల్పించారు. ప్రతి వార్డులో, పంచాయతీలో ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. దీంతో పేదింటి క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభ వెలుగు చూస్తుంది. పెద్దలు కూడా వ్యాయామం చేసుకునేందుకు ఉపయోగకరంగా ఉన్నాయి.

– జీరు భారతిరెడ్డి, జీరుపేట

గతంతో పోలిస్తే సూపర్



గతంలో ఎలాంటి క్రీడలైనా ప్రైవేట్ స్థలాల్లోనే నిర్వహించేవారు. ఇప్పుడు ప్రైవేట్ స్థలాలు తగ్గిపోయి క్రీడలకు ఇబ్బందిగా ఉన్న తరుణంలో సీఎం జగన్ ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయడం సంతోషకరం. ప్రైవేటు జిమ్‌లకు వెళ్లకుండా ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రశాంతంగా వ్యాయామం చేసుకుంటున్నాం.

– చిల్ల గణేష్‌రెడ్డి, కబడ్డీ క్రీడాకారుడు, చిల్లపేట

క్లుప్తంగా

ముత్తంశెట్టి సహకారం అభినందనీయం



ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును సత్కరిస్తున్న అఖిలపక్ష నాయకులు

మధురవాడ: మధురవాడ ప్రాథమిక సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) రక్షణకు సహకారం అందించినందుకు మధురవాడకు చెందిన వివిధ పార్టీల నాయకులు సీసీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును కలిసి అభినందించారు. ఈ మేరకు విశాఖలోని ఆయన నివాసంలో మంగళవారం కలిసి సత్కరించారు. సంస్థ అభివృద్ధికి తన సహకారం ఎప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

గురుస్వామి ఆకెళ్లకు నివాళి



గురుస్వామి ఆకెళ్ల నరసింహమూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శిష్యులు

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు రామాలయ అర్చకుడు ఆకెళ్ల నరసింహమూర్తి జయంతి సందర్భంగా మంగళవారం ఆలయంలో ఆయన చిత్రపటానికి పలువురు శిష్యులు నివాళులర్పించారు. ఆయన 40 ఏళ్లుగా అయ్యప్ప స్వామి మాలధారణ చేసిన వేలాది మందికి గురువుగా ఆధ్యాత్మిక మార్గంలో నడిపించారని గుర్తు చేసుకున్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, గురుస్వాములు మాల్యాద్రి, గంట్రేటి ఈశ్వరరావు, అక్కరమాని ఆదిబాబు, చిల్ల గణేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారతీయ భాషలు ఎంతో గొప్పవి

భీమునిపట్నం: భారతదేశంలోని రాష్ట్రాల్లో వాడుకలో ఉన్న విభిన్న భాషలు ఎంతో గొప్పవని జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్) ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్ అన్నారు. డైట్ కళాశాలలో తమిళ మహాకవి, సంఘ సంస్కర్త సుబ్రహ్మణ్య భారతి సంస్మరణార్థం నిర్వహిస్తున్న భారతీయ భాష ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఆయన మాట్లాడారు. ప్రతి భాషకు ఎంతో గొప్పదనం, మాధుర్యం ఉంటుందని, వాటిని ప్రతి ఒక్కరూ గౌరవించాలని కోరారు. అన్నింటిలోనూ తెలుగు భాషకు ప్రత్యేకత ఉందన్నారు. ఇతర భాషలను నేర్చుకుంటే అక్కడి సంస్కృతి, సంప్రదాయాలు తెలుస్తాయన్నారు. అధ్యాపకులు మహాలక్ష్మి, త్రినాథరావు, మాధవి పాల్గొన్నారు.

కుంతీ మాధవ స్వామి ఆలయంలో సినిమా షూటింగ్



ఆలయ ప్రదక్షిణ చేస్తున్న సినీ బృందం

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో మంగళవారం సినిమా షూటింగ్ చేశారు. కుంతీ మాధవ స్వామి ఆలయానికి వస్తున్న హీరోయిన్ పరియా అబ్దుల్లాను హీరో అల్లరి నరేష్ మొదటిసారిగా పరిచయం చేసుకునే సన్నివేశాన్ని చిత్రీకరించారు. చిలక ప్రొడక్షన్ ఆధ్వర్యంలో తీస్తున్న ఈ సినిమాకు డైరెక్టర్‌గా మల్లి వ్యవరిస్తున్నారు.

తప్పిన ప్రమాదం

కొమ్మాది : జాతీయ రహదారిపై ఎండాడ వద్ద ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... విజయనగరం ప్రాంతానికి చెందిన పి.సన్యాసిరావు సోమవారం రాత్రి విశాఖపట్నంలో ఒక ఫంక్షన్ కోసం కుటుంబ సమేతంగా కారులో వచ్చి తిరిగి వెళ్తుండగా ఎండాడ సమీపంలో జాతీయ రహదారిపై ఎదురుగా ఓ లారీ రావడంతో కారును పక్కకు మళ్లించడంతో డివైడర్‌పైకి దూసుకుపోయింది. అక్కడి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఎవరికీ ప్రాణాపాయం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఓటర్ల చైతన్యంతోనే ప్రజాస్వామ్యం విజయవంతం

భీమిలి ఆర్‌డీవో భాస్కరరెడ్డి



మధురవాడలో ర్యాలీ ప్రారంభిస్తున్న ఆర్‌డీవో భాస్కరరెడ్డి



మాట్లాడుతున్న భీమిలి ఆర్డీవో భాస్కరరెడ్డి

మధురవాడ: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, 18 ఏళ్లు నిండిన వారంతా ఓటు నమోదు చేయించుకుని ఎన్నికల్లో ఓటేస్తే ప్రజాస్వామ్యం విజయవంతమవుతుందని ఆర్‌డీవో ఎస్.భాస్కరరెడ్డి అన్నారు. ఓటరు జాబితాపై అవగాహన కల్పించేందుకు మధురవాడ నుంచి తగరపువలస వరకు మంగళవారం చేపట్టిన భారీ బైక్ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బుల్లెట్ కంటే ఓటు ఎంతో గొప్పదన్నారు. భీమిలి డివిజన్ పరిధిలో 13 వేల మంది 18 నుంచి 19 ఏళ్లు నిండిన వారున్నారని, ఇప్పటి వరకు 6 వేల మంది మాత్రమే ఓట్లు నమోదు చేయించుకున్నారన్నారు. మిగిలిన వారి ఓట్లు నమోదు చేయించడానికి విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. డిసెంబర్ 2, 3న ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నామని, సద్వినియోగం చేసుకుని ఓట్లు నమోదు చేయించుకోవాలని పిలుపునిచ్చారు. ర్యాలీ క్రికెట్ స్టేడియం వద్ద గల వీ కన్వెన్షన్ నుంచి బయలుదేరి కార్ షెడ్ కూడలి, మధురవాడ, కొమ్మాది, మారికవలస, పరదేశిపాలెం మీదుగా తగరపువలస వైపు సాగింది. కార్యక్రమంలో ఆనందపురం, భీమిలి తహసీల్దార్లు లోకవరపు రామారావు, సీహెచ్.రమేష్, జోనల్ కమిషనర్లు బొడ్డేపల్లి రాము, కె.కనక మహాలక్ష్మి, విశాఖ నార్త్ జోన్ ట్రాఫిక్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ వెంకటరావు, విశాఖ రూరల్ మండల ఆర్ఐ ప్రవీణ్‌కుమార్, రెవెన్యూ అధికారులు, బీఎల్‌వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తగరపువలస: 18 ఏళ్లు నిండిన వారంతా ఓటింగ్‌లో పాల్గొంటే పటిష్టమైన ప్రభుత్వాన్ని ఎన్నుకునే అవకాశం ఉంటుందని భీమిలి ఆర్డీవో ఎస్.భాస్కరరెడ్డి అన్నారు. ఓటేయకుండా ప్రభుత్వాలను నిందిస్తే ప్రయోజనం లేదన్నారు. మధురవాడ నుంచి వందలాది ద్విచక్ర వాహనాలతో ర్యాలీ తగరపువలస చేరుకున్న తర్వాత బంతాట మైదానంలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికలకు నియోజకవర్గంలో 13,500 ఓట్లు పెరగాల్సి వుండగా కేవలం 6 వేల మంది మాత్రమే నమోదు చేసుకున్నారన్నారు. ఓట్ల నమోదుకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో భీమిలి జెడ్పీస్ బి.రాము, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ



సంతపేట కొత్తమ్మతల్లి



అలంకరణలో తాటితూరు పైడితల్లమ్మ అమ్మవారు



అలంకరణలో రాస పోలమాంబ అమ్మవారు

తగరపువలస: సంతపేట కొత్తమ్మతల్లిని రాయల్ రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో బంతి పువ్వులు, తులసి మాలలు, గజమాలలతో చిప్పాడకు చెందిన సాడి కుమార్, తాళ్లవలసకు చెందిన బోని ఈశ్వరరావు మంగళవారం అలంకరించారు. ఈ అలంకరణకు కాళ్ల సురేష్, కాకి రమణ, గంటా చిన్నారావు, నందిక లక్ష్మణ, జనార్దన్, మామిడి శ్రీను, అరవింద్, సన్యాసిరావు సహకారం అందించారు. భీమిలి మండలం తాటితూరు గ్రామదేవత పైడితల్లి అమ్మవారిని భక్తులు చామంతి పూలదండలతో అలంకరించారు. మజ్జివలస గ్రామదేవత రాస పోలమాంబ అమ్మవారిని తుపాకుల కనకరెడ్డి, గీతాశ్రీ సహకారంతో బంతి, చామంతి, గులాబి దండలతో అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవార్లను ఆయా గ్రామాల ప్రజలు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రతీ గడపకూ సంక్షేమ పథకాలు



పాండ్రంగిలో సంక్షేమ పథకాల మంజూరు పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

పద్మనాభం: సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో ప్రతీ గడపకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పాండ్రంగి పంచాయతీ పాండ్రంగి, కురపల్లి, బర్లపేట గ్రామాల్లో మంగళవారం రాత్రి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికే సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. మౌలిక సదుపాయాలు కల్పించేందుకు సచివాలయానికి రూ.20 లక్షలు చొప్పున మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. పాండ్రంగి సమీపాన గోస్తనీ నదిలో వంతెన నిర్మించి తీరుతామన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో వంతెన నిర్మించకుండా 20 ఏళ్లు నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. గంటా శ్రీనివాసరావు మంత్రిగా చేసినప్పటికీ వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టలేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వంతెన నిర్మాణానికి రూ.16.50 కోట్లు మంజూరు చేయించామన్నారు. డిసెంబర్ 28లోగా వంతెన నిర్మాణ పనులు ప్రారంభించి తీరుతామని తెలిపారు. పాండ్రంగిలో కాలనీ ఇళ్లు కావాలని కోరగా 160 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిశీలించి అర్హులకు మంజూరు చేస్తామని తెలిపారు. అనంతరం ప్రభుత్వ సంక్షేమ పథకాల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పాండ్రంగిలో జలజీవన్ మిషన్ నిధులు రూ.1.64 కోట్లతో ఇంటింటికీ కుళాయిల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, నాయకులు పల్లి మహేష్, అముజూరి అప్పారావు, పిన్నింటి రమణ, ఈర్ల ఈశ్వరరావు, సుంకర బంగారప్పడు, మొకర అప్పలనాయుడు, తాలాడ పద్మనాభం పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన సాధ్యం

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ: రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు కోసం నాలుగేళ్లలో రూ.4.70 లక్షల కోట్లు ఖర్చు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి దక్కుతుందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం జీవీఎంసీ 7వ వార్డు చంద్రంపాలెం 55వ నంబరు సచివాలయం పరిధి ఎన్జీవోస్ కాలనీలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ నాయకులు, సినిమా హీరోలు చెప్పే మాటలు విని మోసపోవద్దన్నారు. గతంలో చంద్రబాబు రుణ మాఫీ, సున్నా వడ్డీకి రుణాలు వంటి హామీలిచ్చి అమలు చేయలేదన్నారు. సున్నా వడ్డీ, రుణ మాఫీ, తదితర ఎన్నికల హామీలన్నీ సీఎం జగన్ మోహన్ రెడ్డి అమలు చేశారని గుర్తు చేశారు. ఇంటి వద్దే సేవలు అందాలన్నా, సచివాలయ వ్యవస్థ కొనసాగాలన్నా మళ్లీ జగన్‌మోహన్ రెడ్డినే ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. 7వ వార్డులో సంక్షేమం, అభివృద్ధి కోసం రూ.72 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు త్వరలో అందజేస్తామన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ పతాకాన్ని, సంక్షేమ పథకాల ఫ్లెక్సీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, జేసీఎస్ కన్వీనర్ కుడితి రామారావు, కల్చరల్ వింగ్ రీజినల్ ఇన్‌చార్జి వంకాయల మారుతీప్రసాద్, పిళ్లా సూరిబాబు, పి.అప్పన్న, చేకూరి రజని, ఎం.వెంకటరావు, జగ్గపల్లి నరేష్, తమ్మినేని వరలక్ష్మి, శ్రీదేవి, బాబ్జీ, బంగారు ప్రకాశ్, బెల్లాపు పాపారావు పాల్గొన్నారు.



దెక్కతిపాలెంలో వైఎస్సార్‌సీపీ పతాకావిష్కరణ

మళ్లీ జగనే సీఎం కావాలి

తగరపువలస: గత ప్రభుత్వాల కంటే చాలా మెరుగ్గా రాష్ట్రంలో గత అయిదేళ్లలో సంక్షేమం పథకాలు అమలు చేసి, అభివృద్ధి చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమంలో భాగంగా సంక్షేమ పథకాలు ఫ్లెక్సీని ఆవిష్కరించి పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా జగనే మళ్లీ సీఎం కావాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి శిల్లా సరళారాణి, అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి జగుపల్లి ప్రసాద్, జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి చిప్పాడ వెంకటేష్, శిల్లా కరుణాకరరెడ్డి, బింగి హరికిరణ్‌రెడ్డి, నమ్మి లక్ష్మణ, కొందపు సూరిబాబు, చిల్ల సూర్యనారాయణరెడ్డి, కంచుబోయిన వెంకటరావు, తెడ్లాపు అప్పలరాజు, చేట్ల శ్రీనివాసరెడ్డి, తోణంగి ఎల్లాజీ, బోర రామారావు, చిల్ల ప్రమీల, కృష్ణవేణి, మద్ది మహాలక్ష్మి, జీరు పద్మ, చేట్ల అప్పలసూరమ్మ, సరగడ నాగిరెడ్డి పాల్గొన్నారు.

• భీమిలి మండలం రేఖవానిపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ సమ్మిడి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ పీతల గంగశ్రీను, కన్వీనర్ పలపాల పద్మ, అధ్యక్షుడు మల్లేటి హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ విద్యపై ఉపాధ్యాయులకు శిక్షణ

ఆనందపురం : ఉపాధ్యాయుల్లో డిజిటల్ నైపుణ్యాలు మెరుగు పరచడానికి ఇన్ఫోసిస్ సంస్థ స్ప్రింగ్ బోర్డు ద్వారా ఉచితంగా శిక్షణ అందజేస్తోందని సర్వ శిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్ట్ కో – ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు చెప్పారు. మండలంలోని నేల్తేరులో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల కేజీబీవీ విద్యాలయాల్లో పని చేస్తూ కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న ఉపాధ్యాయులకు డిజిటల్ నైపుణ్యాలు పెంపొందించడానికి శిక్షణ అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా బోధనలో మార్పులు తీసుకొచ్చేందుకు శిక్షణ ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ ప్రోగ్రాం ద్వారా 2025 నాటికి 10 మిలియన్ల విద్యార్థులకు డిజిటల్ నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యమన్నారు. ఇన్ఫోసిస్ సంస్థ ప్రతినిధులు సంతోష్ శ్రీరంగం, సాయి నరేంద్ర మాట్లాడుతూ పాఠశాల, కళాశాల విద్యార్థులతోపాటు, వృత్తిదారులు, ఉద్యోగులు ఎవరైనా ప్లాట్‌ఫామ్‌ని వినియోగించుకొని శిక్షణ పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో జీసీడీవో కలేషా బేగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గెడ్డలో రోడ్డు నిర్మాణంపై విచారణ

ఆనందపురం : మండలంలోని మామిడిలోవ పంచాయతీ దబ్బందలో గెడ్డలను పూడ్చివేసి రోడ్డు నిర్మిస్తున్నారని అందిన ఫిర్యాదు మేరకు స్థానిక రెవెన్యూ అధికారులు విచారణ జరుపుతున్నారు. కొండల నడుమ ఉన్న దబ్బందలో కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు అనధికార లే అవుట్ వేశారు. దానికి మార్గం లేకపోవడంతో గెడ్డలను పూడ్చివేసి కల్వర్టులు, రోడ్డు నిర్మించారు. దీనిపై కొంత మంది స్థానికులు ఇటీవల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తహసీల్దార్ రామారావు ఆదేశాలతో రోడ్డు నిర్మాణంపై అధికారులు విచారణ జరుపుతున్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



భీమిలిలో ప్రచారం చేస్తున్న ప్రబోధ సేవా సమితి సభ్యులు

తగరపువలస: త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఉరవకొండ ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞానవేదిక సభ్యులు భీమిలి, బీచ్‌రోడ్డు, తగరపువలసలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ప్రచారం నిర్వహించారు. ప్రబోధానందుడు వివరించిన దేవాలయ రహస్యాలు, ఆత్మ దర్శనం, కార్తీకదీప విశిష్టతను భక్తులకు తెలియజేశారు. కార్యక్రమంలో విజయనగరం కమిటీ అధ్యక్షుడు శంకరరావు, ఉరవకొండ ప్రతినిధులు శ్రీను, సూరిబాబు, వెంకటేష్, జగ్గారావు, భానుమతి, లోకేష్, కోటి, ఆదినారాయణ, దుర్గారావు, బంగారమ్మ, మీనా, వందన, త్రివేణి, ప్రమీల, ఆదిలక్ష్మి, మౌనిక, భాష్మి తదితరులు పాల్గొన్నారు.